సాక్షి
జనగామ

మంగళవారం । 21 । మార్చి । 2023



‘ఆబ్కారీ’ చేతివాటం

అక్రమ వ్యాపారాన్ని అరికట్టాల్సిన ఆబ్కారీ పోలీసులు చేతివాటం ప్రదర్శించారు. పట్టుకున్న నల్లబెల్లాన్ని అమ్మకానికి తరలిస్తూ దొరికిపోయారు. - 8లో▸



ప్రభుత్వ ఖజానాకు టోకరా

నకిలీ వే బిల్లులతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో టోకరా వేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు సీపీ తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$33^0/21^0$

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి పూట చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

పంచాంగం ఆవిష్కరణ



జనగామ: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ప్రభుత్వ ఉద్యోగుల అభివృద్ధి సంఘం రూపొందించిన శోభకృత్ నామ నూతన సంవత్సర పంచాంగాన్ని సోమవారం కలెక్టర్ శివలింగయ్య ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా బాధ్యులు కొక్కొండ జగదీశ్వరాచారి, నల్లనాగుల రాజు, టి.మల్లికార్జున్, రంగు రామచంద్రమూర్తి, ఆంజనేయులు, జిల్లా విశ్వబ్రాహ్మణ మాతృసంఘం అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి, ఐక్యసంఘం జిల్లా అధ్యక్షుడు దిగోజు నరసింహాచారి, అయ్యప్ప ఆలయ ప్రధాన పూజారి కాసోజు రాజేశ్వరాచార్యులు, వలబోజు చక్రపాణి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 237 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 237 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఓ బైరి శ్రీనివాస్ తెలిపారు. జనరల్ విభాగంలో 3,475 మందికి 3,379, ఒకేషనల్ విభాగంలో 1,400 మందికి 1,259 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు.

విధుల్లో చేరిన పీజీ మెడికల్ విద్యార్థులు



జనగామ: డిస్ట్రిక్ట్ రెసిడెన్సి ప్రోగ్రాంలో భాగంగా ఎండీ, ఎంఎస్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెకండియర్ మెడికల్ విద్యార్థులు 13 మంది సోమవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి విధుల్లో చేరారు. వీరు మూడు నెలల పాటు ఆస్పత్రిలో శిక్షణ పొందుతారని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలరావు, మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ సుగుణకర్‌రాజు తెలిపారు.

ఇంటి వద్దకే భద్రాద్రి తలంబ్రాలు

జనగామ: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ సంస్థ భక్తుల ఇంటి వద్దకు పంపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ శివలింగయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆర్టీసీ కార్గో ప్రతినిధి అవినాష్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అవినాష్ మాట్లాడుతూ జనగామ లాజిస్టిక్ విభాగం ఆధ్వర్యంలో రూ.116 చెల్లించిన భక్తులకు స్వామివారి కల్యాణ తలంబ్రాలు అందిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు జనగామ-96187934458, స్టేషన్‌ఘన్‌పూర్-9652008475, నర్మెట-79936 02543, బచ్చన్నపేట-7893540909 నంబర్లలో సంప్రదించాలన్నారు. చంద్రశేఖర్, మనోహరి, రవీందర్ పాల్గొన్నారు.

పాలకుర్తి అంగడి వేలం ఆదాయం రూ.24.60 లక్షలు



పాలకుర్తి టౌన్: పాలకుర్తి అంగడి వేలం ద్వారా రూ.24.60 లక్షల ఆదాయం వచ్చినట్టు పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతరావు తెలిపారు. సోమవారం స్థానిక జీపీ ఆవరణలో వేలం నిర్వహించగా.. గొర్రెలు, మేకలకు సంబంధించి నర్సంపేటకు చెందిన పాలకుర్తి ప్రభాకర్ దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. అయితే గత ఏడాది రూ.23.55 లక్షలు రాగా.. ఈ ఏడాది రూ.1.05 లక్షలు పెరిగినట్లు చెప్పారు. అలాగే బహిరంగ వేలం తైబజార్‌తోపాటు పశువుల రహదారి వేలానికి గత ఏడాది కంటే పాట తక్కువ రావడంతో వాయిదా వేశామని, ఈనెల 27న తిరిగి నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేల పాటలో ఎంపీటీసీలు ఎడవెల్లి పురుషోత్తం, కమ్మగాని పుష్పలీల నాగయ్య, ఉపసర్పంచ్ తరాల చంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి వెంకటచారి, కారోబార్ పూజారి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

24న విద్యుత్ సౌధ ఎదుట ధర్నా
- టీఎస్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రత్నాకర్‌రావు

రైల్వే లోకో పైలెట్లా.. రోబోలా?

పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలి
- ఐజీపీ ట్రైనింగ్ అధికారి తరుణ్‌జోషి

అనువైన నేలలో చేపల పెంపకం మేలు
- కేవీకే మామునూరు శాస్త్రవేత్త డాక్టర్ గణేష్

- వివరాలు 10లో▸

సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌తో సమస్య చెప్పకుంటున్న మహిళ, వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

- గ్రీవెన్స్‌లో ప్రజల వేడుకోలు
- వివిధ సమస్యలపై 56 అర్జీలు
- స్వీకరించిన కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్ : ‘ఏ ఆధారమూ లేదు.. రేషన్ కార్డు ఇప్పించి ఆదుకోవాలి.. పట్టా అయిన భూమి రికార్డులో తక్కువగా ఉంది.. భూమి ఆక్రమించాలని చూస్తున్నారు’.. ఇలా పలు సమస్యలపై అర్జీలు సమర్పించిన ప్రజలు పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 56 అర్జీలు రాగా.. కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర అధికారులు స్వీకరించారు. వినతుల్లో తహసీల్దార్ పరిధిలో అత్యధికంగా 35 రాగా, ఆర్డీఓ 8, డీఆర్డీఓ 4, వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయ్, బీసీ వెల్ఫేర్‌కు రెండు చొప్పున, పోలీసు, డీపీఓ, ఇంజనీరింగ్‌కు ఒక్కోటి వచ్చాయి.

వినతుల్లో కొన్ని ఇలా..

- జనగామ మండలం వడ్లకొండకు చెందిన గుండె రేణుక పాత కలెక్టరేట్‌లో స్వీపర్‌గా పనిచేసేది. కొత్త కాంట్రాక్ట్‌తో పనిలో నుంచి తొలగించారని, ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో స్వీపర్‌గా ఇప్పించాలని అర్జీ పెట్టుకుంది.
- తమ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని, దానిని రద్దు చేసి తన పేర చేయాలని లింగాలఘణపురం మండలం కుందారం గ్రామానికి ఆర్.లక్ష్మి వినతిపత్రం ఇచ్చింది.
- తాను నిరుపేదను.. ఒంటరి మహిళను.. జీవనానికి అంత్యోదయ కార్డు ఇప్పించి ఆదుకోవాలని బచ్చన్నపేట మండలానికి చెందిన ముద్రకోల కవిత వేడుకుంది.

కేసులతో ఇబ్బంది పడుతున్నం



తరిగొప్పుల మండలం సర్వే నంబర్ 844లో 7 ఎకరాల 5 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 300 మంది వరకు ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. అనుమతి లేదంటూ ఖాళీ చేయమని చెప్పిన తహసీల్దార్, పోలీస్ అధికారులు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెలను కాల్చివేయడంతో మామీద కేసులు పెట్టారు. ఇబ్బంది పడుతున్నం. కేసులు రద్దు చేసి సమస్య పరిష్కరించాలని బాధితులు కలెక్టర్‌కు విన్నవించారు.

భూమిని కాపాడాలి



నాకు సర్వే నంబర్ 510.1లో 26 గుంటలు భూమి ఉంది. ఈ నంబర్లు వేరే భూమిలో ఉన్నాయని గ్రామానికి చెందిన కొందరు నా భూమి కాజేయాలని చూస్తున్నారు. సర్వే చేయించి భూమిని కాపాడాలి.

- ఎద్దు లింగం, బచ్చన్నపేట

ఏ ఆధారమూ లేదు



నా భర్త రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు మూడేళ్ల కుమారుడు (దివ్యాంగుడు) ఉన్నాడు. ఎలాంటి ఆధారం లేదు. కనీసం రేషన్ కార్డు కూడా లేదు. అంత్యోదయ కార్డు ఇప్పించి ఆదుకోవాలి.

- బూడిద అండాలు, కట్కూర్(బచ్చన్నపేట)

భూమి సర్వే చేయించాలి



నర్మెట మండలం హన్మంతాపూర్‌లోని సర్వే నంబర్ 296,1,2లో నా భార్య విమల పేరున ఎకరం నాలుగు గుంటల భూమి ఉంది. ఇప్పటి వరకు ఎవరికీ అమ్మలేదు. ఆన్‌లైన్‌లో చూస్తే 10 గుంటల భూమి తక్కువగా ఉంది. సర్వే చేయించి పట్టాలో ఎక్కించాలి.

- రాంకోటి, అడవికేశ్వాపూర్(జనగామ)

ఉపాధి కల్పించి ఆదుకోవాలి



రోడ్డు ప్రమాదంలో రెండు కళ్లు పూర్తిగా పోయాయి. ఏపనీ చేయలేను. కుటుంబానికి ఆసరాగా ఉండడానికి జనరల్ స్టోర్ ఏర్పాటుకు సబ్సిడీ రుణం ఇప్పించి ఆదుకోవాలి.

- బిట్ల విఠల్, రఘునాథపల్లి

టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

- ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు
- పరిశీలించిన కలెక్టర్ శివలింగయ్య



కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ: టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయా శాఖల అధికారులతో కలిసి పట్టణంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యే వరకు భోజన వసతి, స్టడీ రూం, మెటీరియల్ తదితర సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నదని చెప్పారు. జిల్లాలో ఎస్సీ అభ్యర్థులు 60 మంది, ఎస్టీ ఆరుగురు, బీసీ 25, మైనార్టీ ఐదుగురితో పాటు ఇప్పటికే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న 100 మందికి ఈ ఏడాది జూన్ 10వ తేదీ వరకు ఉచిత శిక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ, మైనార్టీ సంక్షేమ అధికారి ఇస్మాయిల్, ఎస్సీ కార్పొరేషన్ సంక్షేమ అధికారి కొర్నేలియస్, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, మైనింగ్ ఏడీ రామాచారి, కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చివరి శ్వాస వరకు ప్రజలతోనే ఉంటా..

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో రాజకీయాల్లో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాను.. చివరి శ్వాస వరకు వారితోనే ఉంటాను.. అని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. వివిధ మండలాల్లో చేపట్టనున్న రూ.25 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రొసీడింగ్స్, 101 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం డివిజన్ కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం మాట్లాడారు. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని, ప్రత్యేక తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ రూ.8వేల కోట్లతో ప్రాజెక్టు పనులను పూర్తి చేశారని చెప్పారు. కరువు జిల్లా దేవాదుల ప్రాజెక్టుతో సస్యశ్యామలంగా మారిందని చెప్పారు. అయితే నియోజకవర్గంలో ఎన్ని రిజర్వాయర్లున్నాయి.. ఎంత సామర్థ్యం.. ఆయకట్టు ఎంత అనే అవగాహన లేనివారు దేవాదుల నీళ్లను తామే తెచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు కలిగిస్తోందని ఆరోపించారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రానికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి, ఒక ప్రాజెక్టు, ఒక్క విశ్వవిద్యాలయం తేలేని దద్దమ్మలు ఇక్కడి బీజేపీ నేతలని అన్నారు. వారు గ్రామాల్లోకి వస్తే తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీకి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని, కేసీఆర్ నాయకత్వంలో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు.

తాను ఎవరికీ క్షమాపణ చెప్పలేదు

తన రాజకీయ జీవితంలో ఏ తప్పూ చేయలేదు.. నీతిగా, నిజాయితీగా ఉన్నాను.. ఎవరికీ క్షమాపణ చెప్పలేదంటూ కడియం శ్రీహరి పరోక్షంగా ఎమ్మెల్యే రాజయ్యను ఉద్దేశించి మాట్లాడారు. తాను పదవులు, పథకాలు అమ్ముకోలేదని, ఒక్క రూపాయి తీసుకోకుండా పనిచేశానన్నారు. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకూ ఏ తప్పు చేయనని, తప్పు చేసి నియోజకవర్గ ప్రజలకు తలవంపులు తేనని ఉద్వేగంగా మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, రాపోలు మధుసూదన్‌రెడ్డి, అన్నెం బ్రహ్మారెడ్డి, రాంబాబు, బూర్ల లతాశంకర్, పోగుల సారంగపాణి, కోతి రేణుకరాములు, వంగాల జగన్మోహన్‌రెడ్డి, తీగల కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంచనపల్లి సొసైటీలో అక్రమాలు

- చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం
- ప్రతులను కలెక్టర్, డీసీఓలకు అందజేసిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ డైరెక్టర్లు



డీసీఓకు తీర్మాన పత్రాలు ఇస్తున్న డైరెక్టర్లు

రఘునాథపల్లి: కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్, వైస్ చైర్మన్, సీఈఓలు లక్షలాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ డైరెక్టర్లతో కలిసి ఆ పార్టీ నాయకులు ఇటీవల సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కలెక్టర్, డీసీఓలకు ఫిర్యాదు చేశారు. అయితే విచారణలో జాప్యం చేయడంతో పాలకవర్గంలోని 13 మంది డైరెక్టర్లలో కాంగ్రెస్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన తొమ్మిది మంది చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం ప్రకటిస్తూ సోమవారం కలెక్టర్, డీసీఓలకు తీర్మాన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కావటి భాస్కర్‌యాదవ్, అయిత జయరాములు, మేడిపల్లి వెంకటేశ్వర్లు, పసుల ఏలియా, గూడెల్లి మహేష్, బొల్లపల్లి సౌందర్య, గొరిగె వెంకటేశ్వర్లు, జిట్టె వీరస్వామి, సల్లా దామోదర్‌రెడ్డి ఉన్నారు.

అంతులేని అక్రమాలు..

సొసైటీలో అక్రమాలు అంతులేకుండా జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎరువులపై వచ్చిన ఆదాయం, ధాన్యం కొనుగోళ్లకు వచ్చిన కమీషన్ డబ్బుల జమ, ఖర్చు వివరాలు ఎప్పటికప్పుడు సొసైటీ రికార్డుల్లో రాసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే కాగితాలపైనే కాకి లెక్కలు చూపించడంతో అవినీతి గుట్టు కదిలింది. సొసైటీ భూమి రిజిస్ట్రేషన్ పేర నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలూ ఉన్నాయి.

బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలి

జనగామ: కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలను ఎండగట్టడానికి సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర ఈనెల 27న జిల్లా కేంద్రానికి చేరుకోనుంది. ఈ సందర్భంగా ఆర్టీసీ చౌరస్తాలో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన బస్టాండ్ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ. అజారుద్దీన్, బి.చందునాయక్, ప్రజాసంఘాల నాయకులు మహేందర్, గణేష్, నాగరాజు, మంగ బీరయ్య, కళ్యాణం లింగం, అజ్మీరా సురేష్ పాల్గొన్నారు.

మినీ టెక్స్‌టైల్ పార్క్‌తో ఉపాధి అవకాశాలు

- జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ శాంత



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శాంత

కొడకండ్ల: స్థానికంగా ఏర్పాటు చేసే మినీ టెక్స్‌టైల్ పార్క్‌తో ఎంతో మంది చేనేత కార్మికులకు ఉపాధి అవకాశం లభిస్తుందని జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ శాంత అన్నారు. మండల కేంద్రంలోని పద్మశాలీ మార్కండేయ భవనంలో సోమవారం పవర్ లూం సభ్యులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మినీ టెక్స్‌టైల్ పార్క్‌పై కార్మికులకు అవగాహన కల్పించడంతోపాటు సూచనలు, సలహాలు స్వీకరించి పార్క్‌ను ఏవిధంగా రూపుదిద్దాలనే దానిపై ప్రభుత్వానికి ప్రాజెక్ట్ రిపోర్ట్ అందించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. సిరిసిల్ల తరహాలో ‘కార్మికుడే యాజమాని స్కీం’ను అమలు చేయాలని ఈ సందర్భంగా కార్మికులు కోరారు. కార్యక్రమంలో ఆర్డీడీలు వెంకటేశం, చారి, అడ్వయిజర్ ఏడీ చౌడేశ్వరి, ఏడీ సాగర్, తహసీల్దార్ చంద్రమోహన్, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు, సర్పంచ్ పసునూరి మధుసూదన్, నాయకులు వెంకటనారాయణ, రమేష్, నవీన్, పాండురంగం, మోహన్, రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



జనగామ: దీక్షలో మాట్లాడుతున్న దశమంతరెడ్డి

జనగామ: తెలంగాణ సర్కారు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. టీఎస్‌పీఎస్సీ ఏఈ ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ.. పార్టీ ఆధ్వర్యంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తిలో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జనగామ ఆర్టీసీ చౌరస్తాలో అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి రూ.లక్ష ఇవ్వాలని, అలాగే గత ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి రూ.3,016 విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని, ఘటనకు బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిరికొండ విద్యాసాగర్ రెడ్డి, యూ.రమేష్, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, భువనగిరి పార్లమెంట్ కోకన్వీనర్ కొంతమ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీలత, అంకుగారి శశిధర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పిట్టల సత్యం తదితరులు పాల్గొన్నారు.

పేదలు ఆక్రమించిన భూములకు పట్టాలివ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

జనగామ: పేదలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ సర్కారు పేదల గురించి ఆలోచించేది నిజమైతే ఈ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సింగారపు రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీఓ 58 ప్రకారం పేదలకు న్యాయం చేయాలన్నారు. ఎలాంటి గడువు లేకుండా ఇంటి స్థలాలకు దరఖాస్తులు స్వీకరిస్తూ.. ప్రభుత్వ భూముల్లో ఉంటున్న పేదలందరికీ అవకాశం కల్పించి ఇల్లు లేని ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను నెరవేర్చాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో నాన్చుడు ధోరణి అవలంభిస్తే.. పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇంటి నిర్మాణానికి స్థలం పట్టాతో పాటు రూ.5 లక్షల నగదు ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి వెంకట్రాజం, ఆఫీస్ బేరర్లు వెన్నపూస కుమార్, పోతకనూరు ఉపేందర్, సాంబరాజు దుర్గాప్రసాద్, గంగాపురం మహేందర్, వడ్లకొండ సుధాకర్, సోమ సత్యం, సభ్యులు కోసంగి శంకరయ్య, మబ్బు వెంకటేష్, చిరంజీవి, రాజేశ్వరి, రేణుక, సరిత, రామ్ నాగేష్, కొప్పుల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర పరిశీలకుడు మాతీన్ అహ్మద్



మాట్లాడుతున్న మాతీన్ అహ్మద్

బచ్చన్నపేట: వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ సయ్యద్ మాతీన్ అహ్మద్ అన్నారు. సోమవారం మండల పరిధి పోచన్నపేట, పడమటికేశ్వాపూర్, కొన్నె, లింగంపల్లి, నక్కవానిగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పరీక్షలు రాసే విద్యార్థులకు సెంటర్లలో అవసరమైన వసతులు కల్పించాలని చెప్పారు. మోడల్ పేపర్ పెర్ఫార్మెన్స్ డెవలప్‌మెంట్, మైండ్ మ్యాపింగ్, ఆన్సర్ షీట్, టైం మేనేజ్‌మెంట్, ఎగ్జామినేషన్ అవేర్‌నెస్ గురించి సూచనలు సలహాలను అందించారు. పరీక్ష కేంద్రాల వద్ద హెల్త్ అధికారులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెంపొందించి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు కుమారస్వామి, కోటయ్య, మండల నోడల్ అధికారి మూర్తి, సీఎస్‌ఓ నీలం వేణు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమ నేతకు దక్కిన గౌరవం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి
- జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకారం
- మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతా : చైర్మన్ బాల్దె సిద్దిలింగం



ప్రమాణం చేస్తున్న పాలక మండలి చైర్మన్, సభ్యులు, వేదికపై ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య తదితరులు

జనగామ: తెలంగాణ ఉద్యమంలో తనతో పాటు పోలీసు లాఠీ దెబ్బలు తింటూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ బెదిరింపులకు భయపడకుండా స్వరాష్ట్రం కోసం పరితపించిన పోరుబిడ్డ, కురుమ సామాజిక వర్గానికి చెందిన సిద్దులు(బాల్దె సిద్దిలింగం)కు ఏఎంసీ చైర్మన్‌తో తగిన గౌరవం దక్కిందని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం ఏఎంసీ నూతన చైర్మన్ బాల్దె సిద్దిలింగం, ఉపాధ్యక్షుడు ముసిపట్ల విజయ్‌కుమార్, సభ్యులు మాల రాజు, శివరాత్రి రాజ్‌కుమార్, నూనెముంతల యాకస్వామి, బసవగాని బాలమల్లేశ్, సేవెల్లి మధుసూదన్, గువ్వల రవి, బుషిగంపల ఆంజనేయులు, ధర్మ జయప్రకాష్‌రెడ్డి, అజ్మీరా మంగమ్మ, సుధగాని సంజీవ, మాశెట్టి వెంకటేశ్వర్లు(అడ్తి), మాశెట్టి అశోక్(ట్రేడర్/రైస్‌మిల్లర్), పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, ఇద్దరు అధికారుల చేత.. జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ నాగేశ్వరశర్మ, ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జీవన్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ అభివృద్ధిలో నూతన పాలక మండలి కీలకంగా వ్యవహరిస్తూ.. ప్రభుత్వానికి పేరు తేవాలన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. మార్కెట్‌కు వచ్చే రైతులకు రూ.5 భోజనం, అత్యవసర వైద్యం కోసం పీహెచ్‌సీ ఏర్పాటుకు నూతన పాలక మండలి మొదటి తీర్మానం చేయాలని సూచించారు. జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రంలో రైతును రాజు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి రైతుల శ్రేయస్సు కోసం పని చేయాలని కోరారు. కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్యామ మల్లేశం మాట్లాడుతూ.. కులవృత్తులతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నూతన చైర్మన్ బాల్దె సిద్దిలింగం మాట్లాడుతూ.. ఈ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేల నమ్మకాన్ని నిలబెట్టుకుని ప్రభుత్వం ఆశించిన విధంగా మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేయడంతో పాటు రైతులకు అందుబాటులో ఉంటామని అన్నారు. అనంతరం నూతన పాలక మండలిని సత్కరించారు. కార్యక్రమానికి ముందుగా.. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి మార్కెట్ వరకు ఒగ్గుడోలు, కోలాటం కళాకారుల విన్యాసాల నడుమ ర్యాలీ నిర్వహించారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల మార్కెట్ చైర్మన్లు గుజ్జరి రాజు, పేరం రాము, ఎంపీపీలు మేకల కలింగరాజు, వరలక్ష్మి, జెడ్పీటీసీలు నిమ్మతి దీపిక, బొల్లం మణికంఠ, శ్రీనివాస్, మారపాక రవి, నాయకులు పోకల లింగయ్య, సేవెల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


ముళ్లపొదల్లో కృష్ణ మృతదేహం

కాజీపేట అర్బన్: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన కాజీపేట మండలం అమ్మవారిపేటలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేటలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బొజ్యన కృష్ణ (36) మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం బీబీనగర్ తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన భార్య రాధిక స్వగ్రామం మడికొండకు ఇటీవల తమ సమీప బంధువులు మృతి చెందగా వచ్చాడు. ఆదివారం రంగశాయిపేటలోని బంధువులను కలిసేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి మడికొండకు వస్తున్న క్రమంలో అమ్మవారిపేటకు రాగానే బైక్ అదుపుతప్పి ముళ్లపొదల్లో పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేయడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిని తండ్రి వేధిస్తున్నాడని కుమారుడి ఆత్మహత్య


బర్ల శ్రీకాంత్(ఫైల్)

గీసుకొండ: తండ్రి తరచుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తన తల్లితో గొడవపడుతూ వేధిస్తుండటంతో మనస్తాపం చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన బర్ల శ్రీనివాస్, స్వరూప దంపతులకు కూతురు, కుమారుడు ఉండగా కూతురు వివాహం జరిగింది. కుమారుడు బర్ల శ్రీకాంత్(27) డిగ్రీ వరకు చదువుకుని ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తండ్రి కూలీ పనికి వెళ్లి తరచుగా తాగి వచ్చి తన తల్లి స్వరూపను తిడుతూ.. కొడుడూ ఉండేవాడు. ఆదివారం రాత్రి కూడా తండ్రి తాగివచ్చి తన తల్లితో గొడవ పడటంతో శ్రీకాంత్ ఆమెను ధర్మారంలోని బంధువుల ఇంటికి పంపించాడు. తిరిగి తన ఇంటికి వెళ్లి గది తలుపులు మూసి ఇంటిలోని దూలానికి ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం అతడి తల్లి వచ్చి కిటికీలో నుంచి చూడగా అప్పటికే దూలానికి వేలాడుతూ మృతి చెంది ఉన్నాడని మృతుడి బంధువులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

ప్రభుత్వ ఖజానాకు టోకరా..

- నకిలీ వే బిల్లులతో ఇసుక రవాణా
- పోలీసులకు చిక్కిన ముఠా
- ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం
- విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్


మాట్లాడుతున్న సీపీ రంగనాథ్, పక్కన అధికారులు

వరంగల్ క్రైం : నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంగనాథ్ మాట్లాడారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా, బిల్లులు ఎలాంటి తేడాలు కనిపించకుండా నకిలీలు సృష్టించి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న 10 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఏదుల కిరణ్, ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్, హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన గంట ప్రదీప్‌రెడ్డి, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంచెళ్ల వెంకటేశ్, ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన పర్లపల్లి శ్రీకాంత్, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన రాజశేఖర్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం సాయిగోనే బావికి చెందిన బండమిద్ది స్వామి, అరుట్ల రాజు, రంగారెడ్డి జిల్లా మంచెల్ మండలం లోయపల్లి గ్రామానికి చెందిన బూడిద శివ, నల్గొండ జిల్లా దిండి మండలం గౌరారం గ్రామానికి చెందిన జోగు సైదులులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన చరణ్‌గౌడ్, ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘన్‌పూర్‌కు చెందిన యనమల్ల రాకేష్, ఆత్మకూరు మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన ముత్యాల రామన్న, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం వావిలాళ్లపల్లికి చెందిన బచనగోని యాదగిరిలు పరారీలో ఉన్నట్లు అయన తెలిపారు. నిందితుల నుంచి 65 నకిలీ వే బిల్లులు, టీఎస్ఎండీసీ 16 స్టాంప్‌లు, 16 లారీలు, 11 సెల్‌ఫోన్‌లు, 1 ల్యాప్‌టాప్, రూ.41వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆదాయానికి గండి

ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకుండా నిందితుల కంప్యూటర్ ద్వారా ఈ ముఠా ఇప్పటికి సుమారు 1,700 వే బిల్లులు సృష్టించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యుల్లో లారీ ఓనర్ల పై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వానికి ఇసుక లోడింగ్ కోసం 12 టైర్ల లారీ ఓనర్లు రూ.10,238, 14 టైర్ల ఓనర్లు రూ.13,085 , 16 టైర్ల ఓనర్లు రూ.14,800 చెల్లించి డీడీలను టీఎస్ఎండీసీకి చెల్లించి ఇసుక లోడింగ్ చేసుకుంటారని, అలా కాకుండా కంప్యూటర్ పై అవగాహన ఉన్న ఏదుల కిరణ్‌కుమార్ నకిలీ వే బిల్లులను క్యూఆర్ కోడ్‌తో సహా సృష్టించి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేసారని సీపీ తెలిపారు. కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని లారీ ఓనర్లతో నేరుగా సంబంధాలను ఏర్పాటు చేసుకొని గత కొంతకాలంగా ఈ ముఠా రాష్ట్రంలోని 37 ఇసుక రీచ్‌లలో దందా కొనసాగిస్తున్నదని సీపీ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వే బిల్లుల దందా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. విచారణ ప్రాథమిక దశలో ఉందని వారం పదిరోజుల్లో ఈ ముఠాకు సంబంధించిన అన్ని వ్యవహారాలను వెలికి తీస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లులను సీపీ అభినందించారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

- ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ శేషు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శేషు

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేషు మాట్లాడారు. వ్యక్తులు చేసిన తప్పులు వ్యవస్థకు అపాదించడం సరైంది కాదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. వ్యక్తులు వ్యవస్థల భాగమేనని గుర్తించాలన్నారు. టీఎస్పీఎస్సీలో జరిగిన తప్పిదాల నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలనుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లోను అప్రతిష్ఠ మూటగట్టుకున్న ఏపీపీఎస్సీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో ఏర్పాటైన టీఎస్పీఎస్సీ కూడా అదే దారితో నడుస్తుందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రాల లీక్, ప్రశ్నాపత్రాల్లో తప్పులు, భర్తీ ప్రక్రియలో జాప్యం వంటి అనేక తప్పిదాలతో టీఎస్పీఎస్సీ నిరుద్యోగుల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. ఈ క్రమంలో టీఎస్పీఎస్సీని సమూలంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్, మెయిల్ ద్వారా ప్రక్షాళనకు చెందిన సూచనలను ఇప్పటికే పంపామని, లేఖ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా వేదిక నాయకులు సతీష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, అజయ్, నరేందర్, దానేశ్వర్, జితేందర్, కిరణ్, బోస్ పాల్గొన్నారు.

తెలంగాణకు రెండో బహుమతి


బహుమతితో జీవిత

వరంగల్(పర్వతగిరి): జైపూర్‌లో గత మూడు రోజులుగా నిర్వహించిన స్క్వాష్ రాకెట్ పోటీలకు గాను తెలంగాణకు రెండో బహుమతి లభించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన జీవిత పోటీల్లో నైపుణ్యం సాధించి రెండో బహుమతికి దోహదపడింది. దేశవ్యాప్తంగా పది టీంలు పాల్గొనగా మొదటి బహుమతి మహారాష్ట్ర దక్కించుకోగా, రెండో బహుమతి తెలంగాణ కైవసం చేసుకుంది. గతంలో అథ్లెటిక్ పోటీల్లో జాతీయ స్థాయిలో.. ప్రస్తుతం స్క్వాష్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించడం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.

నడుస్తున్న ఆటోపై విరిగిపడిన చెట్టు


ఆటోపై పడిన చెట్టు


ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు

- ఏడుగురికి గాయాలు
- ఆస్పత్రికి తరలింపు

ఏటూరునాగారం: కూలీలు, విద్యార్థులతో వెళ్తున్న ఆటోపై రోడ్డు పక్కనే ఉన్న చెట్టు విరిగిపడి ఏడుగురు గాయపడిన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని కొండాయికి చెందిన ఆటో డ్రైవర్ బొల్లికొండ శ్రీకాంత్ తన ఆటోలో మల్యాలకు చెందిన పిచ్చి నర్సమ్మ, పాయం జగ్గమ్మ, పాయం సాయన్న, షాపెల్లికి చెందిన విద్యార్థి బీఏ ఫైనలియర్ వావిలాల దుర్గప్రసాద్, కొండాయికి చెందిన దబ్బగట్ల సారక్క, శివరంజితో కొండాయి నుంచి ఏటూరునాగారం వస్తున్నారు. చిన్నబోయినపల్లి – ఏటూరునాగారం మార్గమధ్యలోని వట్టివాగు వద్దకు రాగానే ఎండిపోయి ఉన్న భారీ వృక్షం రాత్రి వర్షం వల్ల నడుస్తున్న ఆటోపై విరిగి పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పిచ్చి నర్సమ్మకు ఎడమ చేయి, పాయం జగ్గమ్మ ఎడమ భుజానికి, వావిలాల దుర్గ ప్రసాద్‌కు ఎడమకాలుకు తీవ్ర గాయాలుకాగా డ్రైవర్ శ్రీకాంత్, శివరంజి, సాయన్న, సారక్కలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి 108లో తరలించి చికిత్సలు అందించారు. చెట్టు ఆటో పై పడడంతో 163 జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. ఆటోపై పడిన చెట్టును గ్రామస్తులు, ప్రయాణికుల సాయంతో తొలగించి క్షతగాత్రులను కాపాడారు. ఆటో నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ లబోదిబోమంటున్నారు.


గాయపడిన పిచ్చి నర్సక్క

ఆలయంలో నాలుగుసార్లు చోరీ

- సిద్ధేశ్వరాలయంలో తరచూ దొంగతనాలు
- అయినా మారని తీరు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సంపత్‌రావు

చెన్నారావుపేట: అది మండల కేంద్రంలోని ఆలయం.. తరచూ చుట్టూ జనాలు సంచరిస్తూనే ఉంటారు.. అయినా.. ఆ ఆలయంలో తరచూ దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం. ఇప్పటికే ఆలయంలో నాలుగుసార్లు దొంగతనం జరగడం చూస్తుంటే.. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్ధేశ్వరాలయం పూజరులు సోమవారం రోజువారీ పూజలు చేయడానికి ఆలయం చేరుకున్నారు. గుడి వద్దకు రాగా తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి, విషయాన్ని ఆలయకమిటీ చైర్మన్ కంది గోపాల్‌రెడ్డితో పాటు పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి ఏసీపీ సంపత్‌రావు, సీఐ హతిరామ్, ఎస్సై తోట మహేందర్‌లు చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి, హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అయితే హుండీలో సుమారుగా రూ.50వేల వరకు ఉన్న నగదు ఉంటుందని అర్చకులు, పోలీసులు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. పోలీస్ స్టేషన్ సమీపంలోని పొలాల్లో హుండీలు పడేయడం గమనార్హం.

మావోయిస్టు సానుభూతిపరుల అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: మావోయిస్టులకు సహకరిస్తేకఠినంగా కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు ఎస్పీ గాష్ ఆలం హెచ్చరించారు. ఈ మేరకు అనుమానితంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఎనిమిది మంది నిషేధిత సీపీఐ మావోయిస్టు సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని పోలీసు సాయుధ కార్యాలయంలో ఎస్పీ గాష్ ఆలం విలేకరుల సమావేశంలో అరెస్ట్ చూపించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వెంకటాపురం(కె) మండలం రామచంద్రాపురం శివారులో కొంతమంది కారు, ద్విచక్రవాహనంపై అనుమానస్పదంగా ప్రయాణిస్తున్నారని తెలుసుకున్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని వెంబడించారు. కారు, ద్విచక్రవాహనాన్ని వెంబడించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోని పేలుడు పదార్థాలు, ఐఈడీ మెటీరియల్‌లోని తోహభాగాలు, విప్లవ, సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మావోయిస్టు అగ్రనేత దామోధర్, చంద్రన్నతో కలిసి , మరికొంత మంది సభ్యులు భూ సమస్యలను పరిష్కరించడానికి చేస్తున్న విప్లవ భావజాలానికి ఆకర్షితులయ్యారు. దామోదర్ సూచనల మేరకు కూంబింగ్ ఆపరేషన్ల కోసం అడవికి వచ్చే పోలీసులను చంపాలనే ఉద్దేశంతో పేలుడు పదార్థాలను తరలిస్తూ కనిపించారు. పట్టుబడిన వారిని విచారించగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారం గ్రామానికి చెందిన అందె రవి, వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన శ్రీరామోజు మనోజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన దిడ్డి సత్యం, సంగెం మండలానికి చెందిన శ్రీరామోజు భిక్షపతి, మల్హర్ మండలం పెద్దతండా గ్రామానికి చెందిన అనసూరి రాంబాబు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మండలానికి చెందిన గణపురం చంద్రమౌళి, కాప్రా మండలానికి చెందిన పృథ్వీరాజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారానికి చెందిన అందె మానసగా తెలిసింది. నిందితులు అందరిపై కేసులు ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. వారి నుంచి ఐఈడీఎస్–45 యొక్క ఇనుప భాగాలు, 10 మీటర్ల కార్డెక్స్ వైర్, రెండు డిటోనేటర్లు, ఒక బ్యాటరీ, నాలుగు విప్లవ సాహిత్యాలు, మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలకు సంబంధించిన మాత్రలు, కారు బేరింగ్, హోండా మోటార్ ద్విచక్రవాహన బేరింగ్, ఎనిమిది మొబైల్ ఫోన్లు, రూ. 4140 నగదు పట్టుబడినట్లు తెలిపారు. సంఘటన ఆధారంగా వెంకటాపురం(కె) పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశామని అన్నారు. సమావేశంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, వెంకటాపురం(కె) సీఐ శివప్రసాద్, ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆబ్కారీ చేతివాటం

- పట్టుకున్న నల్లబెల్లం అమ్మకానికి తరలింపు
- గుట్టు రట్టు చేసిన మరిపెడ పోలీసులు
- సోషల్ మీడియాలో వైరల్


పట్టుబడిన తొర్రూరు ఎక్సైజ్ బెల్లం వాహనం

మరిపెడ రూరల్: అక్రమ వ్యాపారాలు ఆట కట్టించే ఆబ్కారీ పోలీసులు చేతి వాటం ప్రదర్శించారు. ఓ వేలం వేసిన వాహనంలో అక్రమంగా నల్ల బెల్లం తరలించి అమ్మడానికి డంపుచేస్తుండగా మరిపెడ పోలీసులు పట్టుకుని గుట్టురట్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న పలు వాహనాలను అబ్కారి ఆధ్వర్యంలో ఇటీవల వేలం వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు వేలం పాటలో వాహనాలు దక్కించుకున్నారు. ఈ ఇదే అదునుగా భావించిన ఎక్సైజ్ అధికారులు చేతి వాటం ప్రదర్శించారు. అనుకూలంగా ఉన్న ఓ బెల్లం బస్తాల లోడ్ వాహనాన్ని అర్ధరాత్రి అక్రమంగా తరలించారు. మరిపెడ మండలంలోని యలమంచిలితండాలో శివారులో డంప్ చేస్తున్నారు. తండా వాసుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న మరిపెడ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు వాహనాన్ని పట్టుకొని మరిపెడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో డ్రైవర్ విచారించడంతో అసలు విషయం బయటకు పొక్కింది. వెంటనే మేల్కొన్న అబ్కారీ అధికారి తమ ఆధీనం నుంచే బెల్లం లోడ్ వాహనం అటు వైపుగా వచ్చిందని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చి వాహనాన్ని తొర్రూరు తీసుకెళ్లారు. కంచె చేను మేసిన చందంగా తొర్రూరు ఎక్సైజ్ పోలీసుల తీరు ఉందని ప్రజలు అవాక్కవుతున్నారు. ఈ వ్యవహారమంతా సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం గమనార్హం. ఈ విషయం పై తొర్రూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా. వేలం వేసిన వాహనం విజయవాడకు వెలుతుంది. తమ తప్పిదం వల్ల బెల్లం బస్తాలు అందులోనే ఉండిపోవడంతో మరిపెడ పోలీసులు పట్టుకొని సమాచారం ఇచ్చినట్లు సదరు అధికారి పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మాయ

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన ఓ యువతి ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మి రూ.30వేలు నష్టపోయింది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన యువతి ఓఎల్ఎక్స్ అప్లికేషన్స్ పరిశీలిస్తుండగా అందులో ఒక పల్సర్ బైక్ అమ్మకానికి ఉండగా కింద ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి బేరం కుదుర్చుకుంది. జీఎస్టీ, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీల కింద మోసగాళ్లు చెప్పినట్లుగా డబ్బులను చెల్లించింది. ఆ తర్వాత అటువైపు నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు


గంజాయిని పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : ఎండు గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, సరఫరాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల నుంచి భద్రాచలం మీదుగా వరంగల్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మంపాటి సుమంత్, పాకాల సాయికుమార్, ములుగు వికాస్ అలియాస్ విక్కీలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.60 వేల విలువగల మూడు కిలోల ఎండు గంజాయి, 2 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు శివనగర్‌కు చెందిన కమ్మంపాటి సుమంత్ కరీంనగర్‌లో కొబ్బరి బోండాల వ్యాపారం చేసుకుంటూ ఎవరికి అనుమానం రాకుండా గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడేవాడని తెలిపారు. సుమంత్ స్నేహితులైన పాకాల సాయికుమార్, ములుగు వికాస్‌లు ఎవరికి అనుమానం రాకుండా వరంగల్, మహబూబాబాద్ మీదుగా భద్రాచలం నుంచి ఒడిషాలోని కలిమెలకు ద్విచక్ర వాహనం పై చేరుకొని అక్కడ మొద్దు అలియాస్ భాయ్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి తిరిగి వరంగల్‌కు చేరుకొని 100 గ్రాముల గంజాయిని రూ.500, రూ.700, రూ.1000 చొప్పున అమ్మే వారని తెలిపారు. వరంగల్‌లోని శివనగర్, కాశిబుగ్గ, కరీమాబాద్, ఖిలా వరంగల్, చింతల్, లేబర్‌కాలనీ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. కొంతమంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు గంజాయిని అలవాటు చేసి వారి ద్వారా గంజాయి విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. 15 మంది గంజాయి విక్రయదారులు, 50 మంది వినియోగదారులను ఆదివారం రాత్రి ఖిలా వరంగల్‌లోని రాతికొండ దగ్గరకు వస్తున్నారనే సమాచారంతో వెళ్లగా ముగ్గురు నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. ఇప్పటి వరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు 13 మంది గంజాయి అమ్మకందారులను అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు గంజాయి సేవించే వారిని 159 మందిని గుర్తించి కమిషనరేట్‌లోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 14 మందిని జైలుకు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, ఎస్సైలు వడ్డెబోయిన లవణ్‌కుమార్, నిస్సార్ పాషా, కానిస్టేబుళ్లు రాజేష్, రాజు, బిక్షపతి, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, నవీన్‌లను సీపీ నగదు రివార్డులతో అభినందించారు.

నల్లబెల్లం స్వాధీనం.. కేసు నమోదు


మరిపెడలో పట్టుబడిన బెల్లం లోడ్ నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మరిపెడ రూరల్: అక్రమంగా రవాణ చేస్తున్న 21 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధు సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం స్టేజి నుంచి వయా విస్సంపల్లి, ఎల్లంపేట మీదుగా సోమ్లతండాకు ఓ వాహనంలో బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 42 బస్తాల్లోని 21 క్వింటాళ్ల నల్ల బెల్లాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సోమ్లతండాకు చెందిన గుగులోతు నవీన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకు చెందిన పుల్లారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో సత్యప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రావణ్, మధార్ పాల్గొన్నారు.